ప్రజాశక్తి
బుధవారం 8 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం




రాష్ట్ర స్థాయిలో మండల సమాఖ్యకు గుర్తింపు



పురస్కారాన్ని అందుకుంటున్న సంఘ సభ్యులు

కురుపాం: విజయవాడలో సెర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కురుపాం మండల సమాఖ్యకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. మండల సమైక్య చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇచ్చిన అవార్డులు సెర్ఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ చేతుల మీదగా మండల సమాఖ్య ప్రెసిడెంట్ ఆరిక శాంతి, విఒఎ రమాదేవి అందుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఎపిఎం ఇవి కిషోర్, సిసిలు, మండలంలోని మహిళా సంఘాలు అభినందనలు తెలిపాయి.

ఎక్కడమ్మా.. నీవు లేనిది..!



- కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు
- యాక్టర్ నుంచి డాక్టర్ వరకు
- పోరులో అధినేత్రిగా...
- ఊరిలో అధికారిగా
- ఇంటిని నడిపితే ఇల్లాలిగా
- అన్నింటా రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటి నీవు చేయలేనిది?' అని కీర్తించారో కవి. పోరులో అధినేత్రిగా... ఊరులో అధికారిగా అంటూ మహిళల బహుముఖ పాత్రను వివరించాడు మరో రచయిత. ఇలా సృష్టికే మూలంగా ఉన్న మహిళ ఓవైపు అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది.. నవమాసాలు మోసి, పిల్లల్ని కని, తల్లిగా లాలిస్తు పెద్ద చేస్తుంది.. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతుంది.. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది.. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. ఈ నేపథ్యంలో మహిళల వీరోచిత పోరాటాలను గుర్తుచేసుకుని, ఉన్నతమైన సమాజం వైపు ఆలోచింపజేసుకుంటూ ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, హోంగార్డు నుంచి మేజర్ వరకు మహిళలు రాణిస్తున్నారు. క్రీడ, కళ, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ రంగంలోనూ వారిదే కీలకపాత్ర. జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా ఎన్నో శాఖల్లో ఉద్యోగులు కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. జెసి, డిఆర్‌డిఎ పీడీ, డ్వామా పీడీ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, డిపిఎం, డిపిఒ, విజయనగరం, బొబ్బిలి ఆర్‌డిఒలు ఇలా ఒకరా.. ఇద్దరా ఎంతో మంది జిల్లా అధికారులు కూడా మహిళలే. చివరికి బందరగా మోసేవారిలోనూ మహిళలు భాగస్వామ్యం అవుతున్నారు. ఇలా జీవన పోరాటంలోనూ, సమాజాభివృద్ధిలోనూ భాగస్వామ్యమౌతూనే తిరిగి ఇంటికి వెళ్లాక భార్యగా, అమ్మగా ఇల్లు చక్కబెడుతున్నారు.

పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నప్పటికీ పలు సందర్భాల్లో మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. రాజకీయ వేధింపులు తప్పడం లేదు. పని ప్రదేశాల్లో అగౌరవం, వేధింపులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆఖరికి అమ్మాయి పుట్టుకే అశుభమనుకునే స్థాయికి నేటి సమాజం దిగజారిపోయింది. ఆడబిడ్డగా నిర్ధరణ అయితే గర్భంలోనే కత్తులతో కడతేరుస్తున్నారు. ఇంటి గుమ్మం దాటితే తిరిగివచ్చేవరకు దగ్గర నుంచి మగాళ్లతో మాట్లాడకూడదన్న వరకు అన్నీ ఆంక్షలే. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే ప్రత్యేకించి మన జిల్లాలో మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నా, వారి కుటుంబసభ్యులే పెత్తనం చెలాయిస్తున్నారు. వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లంటే ఎంతో మంది భారంగా భావిస్తున్నారు. బహుశా అందుకేనేమో కొన్నేళ్లుగా జిల్లా జనాభాలో మహిళల సంఖ్య తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంతరాలు పోవాలంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ నరకప్రాయంగా కాకుండా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని, అందుకు రాజ్యాంగ యంత్రాంగం సహకరించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే మహిళా దినోత్సవం

కుట్టుపని చేసే శ్రామిక మహిళలు నిర్వహించిన విరోచిత పోరాట సంప్రదాయాన్ని నిలబెట్టేందుకు ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. అణచివేత, వివక్షతను వ్యతిరేకిస్తూనే స్వేచ్ఛ, సమానత్వం కోసం నేటికీ మహిళలు పోరాడుతూనే ఉన్నారు. జాతి, మత, కుల, ఆర్థిక, సామాజిక వ్యత్యాసాల్ని పక్కనబెట్టి ఒకే వేదికపైకి చేరాల్సిన రోజు ఇది.

ఎన్నిక నిర్వహణకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

పట్టభద్రుల ఎన్నికలు సజావుగా, పగడ్బందీగా నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్నారు. మంగళవారం విశాఖపట్నం నుంచి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక, ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు విశాఖ పట్నంలోని స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు చర్యలను అడిగి తెలుసుకున్నారు. వెబ్‌కాస్టింగ్ లేని పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ కుమార్ మాట్లాడుతూ పార్వతీపురంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని, పోలింగ్ బాక్సులను విశాఖపట్నం తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు మండల స్థాయి ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులతో ఎస్‌పితో సంయుక్తంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే పట్టభద్రులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కు వినియోగించుకొనేలా సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 8 సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రూట్, మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయండి

ఎన్నికల కమిషన్‌ను కోరిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో వైసిపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నికోడ్ ఉల్లంఘనలపై పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలో వైసిపి బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, వాలంటీర్ల వ్యవస్థను తమ అభ్యర్థి గెలుపు కోసం వాడుకుంటోందన్నారు. పలు సందర్భాల్లో వీటిపై జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎయు విసి, సర్వశిక్ష అధికారులు, ఆనందపురం ఎంఇఒపై తాము సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినా వారిపై నేటికీ చర్య తీసుకోలేదన్నారు. ఎయు విసి వ్యవహారంలో తమకు దొరికిన సాక్ష్యాలు కూడా విచారణ అధికారికి దొరక్కపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కావాలనే సాక్ష్యాలను తారుమారు చేయడం తప్పు చేసిన వారిని కాపాడడానికేనన్నారు. విచారణను కూడా కింది స్థాయి అధికారులతో నామమాత్రంగా చేయించడంతో అధికార పార్టీ తన పని తాను చేసుకుపోతోందన్నారు. ఈలోగా ఎన్నికలు పూర్తయ్యే అవకాశముందన్నారు. ప్రభుత్వం జీతాలు చెల్లించే వాలంటీర్ల వ్యవస్థను తన పార్టీ జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. ఇలా చేయడం అనుమతించరాదని తాము ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టరుకు ఈ నెల 2న ఆదేశాలిచ్చారన్నారు. అయినా అవేవీ ఆగడంలేదన్నారు. తాజాగా 5వ తేదీన 3 గంటలకు జివిఎంసి 16వ వార్డులో అధికార పార్టీ వారు ఎన్నికల నిబంధన ఉల్లంఘించి సమావేశం నిర్వహిస్తున్నారని, తక్షణం ఆపాలని ఆ రోజు ఉదయం లిఖిత పూర్వకంగా తాము తెలిపినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే తమ ఓటమి ఖాయమని తెలిసే వైసిపి ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తాము మంగళవారమూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్టు అజశర్మ వెల్లడించారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర పట్టభద్రులు అధికార పార్టీ ఉల్లంఘనలు, అడ్డదారులు, అక్రమాలను గుర్తెరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిజాయతీగా, నిబద్ధతగా, నిస్వార్థంగా పని చేస్తున్న 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై

9,10 తేదీల్లో నిరసనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులపై దాడికి నిరసనగా సిపిఎస్ రద్దు చేయాలని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 9, 10 తేదీల్లో మండల తహశీల్దార్ ఆఫీసుల్లోనూ, కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలు జయప్రదం చేయాలని వామపక్షాలు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు అధ్యక్షతన వామపక్ష సమావేశం జరిగింది. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై మార్చి 9 ,10 తేదీల్లో నిరసన ధర్నా చేపట్టాలని పిలుపునిచ్చారు. ధర్నాలో వామపక్ష పార్టీల సభ్యులు సానుభూతిపరులు అభిమానులు పాల్గొనాలని కోరారు. తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, నెలనెలా జీతాలు ఇచ్చే పరిస్థితుల్లో లేదని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అడిగితే ఉద్యోగులపై నిర్బంధం, వేధింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతుందని, ఇది అన్యాయమని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న డిఎ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని కోరారు. మార్చి 9,10 అన్ని మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాలు వద్ద, 9న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు భాస్కరరావు మాట్లాడుతూ ఉద్యోగులపై వేధింపులను ఖండించారు. కార్యక్రమంలో అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘం పి.సంగాం, సిపిఎం నాయకులు జివి రమణ, కె.రామస్వామి, మండల నాయకులు కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఏప్రిల్ 4 నుంచి 18 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయిలో సన్నాహాలు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షలు నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఈ ఏడాది 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 10,784 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వీరిలో రెగ్యులర్ విద్యార్థులు - 5272, విద్యార్థినులు 5442, ప్రైవేట్ విద్యార్థులు 70 మంది ఉన్నారన్నారు. పరీక్షల సమయంలో మాస్ కాపీ జరగకుండా పర్యవేక్షణకు మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమాచారం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని డిఆర్‌ఒ జె.వెంకటరావును ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక స్ట్రాంగ్ రూం నుంచి ఆయా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించేందుకు గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు ముగిసిన తరువాత జవాబు పత్రాలను ఏరోజుకు ఆరోజు పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేయాలని పోస్టల్ సహాయ సూపరిండెంట్ జివి రమణను ఆదేశించారు. ప్రశ్నా పత్రాలు కేంద్రాలకు చేర్చేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణకు సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా బస్ సర్వీసులను నడపాలని ప్రజా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను పిహెచ్‌సి పరిధిలోని వైద్య అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. సమావేశంలో డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ, డిఎస్‌పి సుభాష్, పార్వతీపురం, పాలకొండ డిప్యూటీ డిఇఒలు బ్రహ్మాజీ, విజయ కుమారి, ఆర్టీసి డిపిటిఒ టివిఎం. సుధాకర్, ఎంపిహెచ్‌ఒ ఎల్.సత్తి బాబు, పాల్గొన్నారు.


సిఆర్‌పిఎఫ్ భవనాల పరిశీలన



పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని 198వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ క్వార్టర్ సముదాయాన్ని అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మంగళవారం ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ సిబ్బంది నివాసం ఉంటున్న క్వార్టర్స్‌తో పాటు స్థానిక పోలీసు స్టేషను పరిశీలించారు శిథిలావస్థకు భవనాలు చేరుకున్న స్థితిని ఎస్పీకి సిఆర్‌పిఎఫ్ అధికారితో పాటు స్థానిక ఎస్సై పైడ్రాజు వివరించారు.




రణస్థలంలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతుకనవుతానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన, పెట్రోలియం యూనివర్సిటీ హామీలు అమలు కాలేదని, వీటిపై శాసనమండలిలో గొంతు వినిపిస్తానని ఆమె చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎనిమిదేళ్లలో ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్లు రావాల్సి ఉండగా, రూ.450 కోట్లే ఖర్చు పెట్టారని విమర్శించారు. సుజల స్రవంతి పూర్తయితే 8 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్రలో అతి పెద్దదైన నెల్లిమర్ల జూట్ మిల్లు కూడా మూతపడిందన్నారు. ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతంపై రుద్దుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి మేలు చేయకపోగా ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆ పని చేయలేదు సరికదా, పోటీ పడి కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నాయని విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్వ ప్రయోజనాలే తప్ప, ఉత్తరాంధ్ర అభివృద్ధి కనీసం పట్టడం లేదన్నారు. జిల్లాకు చెందిన చెందిన ఓ సీనియర్ మంత్రి ఇంకో మెట్టు ముందుకెళ్లి స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని సమర్థించారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి పెట్టాయని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వం అనేక అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తున్న యువత మార్పు కోరుకుంటోందని, ఈ ఎన్నికల్లో పట్టభద్రులు తనను గెలిపిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, నిరుద్యోగ యువత, మహిళల వంటి పలు తరగతుల ప్రజా సమస్యలేవీ చట్టసభల్లో కనీసం ప్రస్తావనకు రావడం లేదని చెప్పారు. పిడిఎఫ్ తరుపున గెలిచిన ఎమ్మెల్సీలే నీతి, నిజాయతీ, నిబద్ధతతో పోరాడుతూ శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకలవుతున్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి వంటి అంశాలు చట్టసభల్లో బలంగా వినిపించాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీల ద్వారానే సాధ్యమన్నారు. 250కు పైగా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర శాసన మండలికి పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు భవిరి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కూన వెంకటరావు, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమాప్రభ పొందూరు, జి.సిగడాం, రణస్థలం, పలాస మండలాల్లోని పలుచోట్ల మంగళవారం విస్తృత ప్రచారం చేశారు.



మృతుని కుమారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఉపాధ్యాయ సమస్యలపై 10న నిరసన : యుటిఎఫ్

కలెక్టరేట్ : ఉపాధ్యాయుల నట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, సిఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే తీవ్ర నిర్బంధాలు విధిస్తున్నందుకు నిరసనగా ఈనెల 10న పట్టణంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల వైఖరి వల్ల, ప్రభుత్వ విధానాల ఫలితంగా అనేక మంది ఉపాధ్యాయులు గుండెపోటుతోను, బైక్ ప్రమాదాల్లో మరణించారని అన్నారు. ఈ మరణాలన్నీ ప్రభుత్వ మరణలేనని యుటిఎఫ్ భావిస్తుందన్నారు. అలాగే జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు సిపిఎస్ రద్దు చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని, మెరుగైన పిఆర్‌సి ఇస్తానని సకాలం డిఎలు ఇస్తానని, ఉద్యోగులను స్నేహితుల్లా చూసుకుంటుని హామీ ఇచ్చారని అన్నారు. అయితే వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. ఇందుకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏనుగు దాడిలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పార్వతీపురం రూరల్: ఏనుగు దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన ఆర్థిక సహాయాన్ని జిల్లా ఫారెస్ట్ అధికారులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. గత నెల 14న బలిజిపేట మండలం చెల్లింపేటకు చెందిన అడపా దేసినాయుడు ఏనుగు దాడిలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వం తరఫున అందించాల్సిన సాయాన్ని మంగళవారం డిఎఫ్‌ఒ జిఎపి. ప్రసూన, ఫారెస్ట్ రేంజర్ త్రినాధరావు ఆధ్వర్యంలో మృతుడు కుమారుడు లక్ష్మంనాయుడుకు రూ.2.5 లక్షలు చెక్కును మొదటి విడతగా అందించారు. కార్యక్రమంలో వైసిపి బలిజిపేట మండల కన్వీనర్ గంటేడ శ్రీరాములు నాయుడు, గ్రామ పెద్దలు బాదిలి జగన్నాథం నాయుడు,అడపా గోపాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి కడుపుకోత

పింఛను నిలిపివేతతో అవస్థలు



బాధితుడు సింహాచలం

సాలూరు :పట్టణంలోని నెయ్యిలవీధిలో ఓ వికలాంగునికి ప్రభుత్వం కడుపుకోత మిగిల్చింది. గత కొన్నాళ్లుగా అందుతున్న పింఛను నిలిపివేయడంతో ఆయన ఆవేదన వర్ణనాతీతం. మున్సిపాలిటీలో 10వార్డులో ఉంటున్న మందాడి సింహాచలంకు గత 9నెలలుగా పింఛను నిలిచిపోయింది. సింహాచలం రేషన్‌కార్డులో రాజమండ్రికి చెందిన ఎవరో ఉద్యోగి పేరు కలిసిపోవడంతో ఆయన పింఛనును ప్రభుత్వం నిలిపివేసింది. ఆయనకు తల్లిదండ్రులు లేరు. వివాహం కూడా కాలేదు. తన పింఛను పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశాడు. ఆయన పరిస్థితి చూసి కలెక్టర్ మానవతా దృక్పథంతో కొంత ఆర్థిక సాయం కూడా చేశారు. కానీ ఆయన సమస్యను పరిష్కరించలేదు. మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్య వివరించాడు. ఆయన కూడా ఆర్థిక సహాయం చేశారు కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఎనిమిది నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో బిక్షాటనతో బతుకుబండి లాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం పాలుకావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇలాంటి అభాగ్యుడ్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- సాలూరు

వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఎడిఇ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వినియోగదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యలను 1912 ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేయాలని కోరారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య పరిష్కారం కాక ఏదైనా నష్టం జరిగితే పరిహారం కూడా ఇప్పిస్తామని చెప్పారు. తమ వద్ద న్యాయం జరగకపోతే రాష్ట్ర స్థాయిలో వున్న అంబుడ్స్ మన్‌కి ఫిర్యాదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సదస్సులో మూడు ఫిర్యాదులు అందాయని చెప్పారు. తమ సంస్థ అమలులోకి వచ్చిన తర్వాత ఇంతవరకు 7,278 సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, 7,231 సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. 47సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2022లో 20 మందికి, 2023లో ఐదుగురికి నష్టపరిహారం ఇప్పించామని చెప్పారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో 94మందికి రూ.4.87లక్షలు పరిహారంగా ఇప్పించామని చెప్పారు. సదస్సులో న్యాయ స్థానం సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, ఎడిఇ జి.శంకరరావు, ఎఇ సింహాచలం పాల్గొన్నారు.



గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రఘురాం

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

పార్వతీపురంరూరల్ : మండలం, మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి ఉగాది నాటికి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని హౌసింగ్ పిడి రఘురాం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఇంజినీరింగ్ సహాయకులు, ఎమినిటీస్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఇళ్ల నిర్మాణాల తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయించి, గృహప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి బిల్లుల చెల్లింపులు జరిగేలా బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆకిబ్‌జావేద్, ఇఇ ప్రసాద్, జెఇ చిరంజీవులు పాల్గొన్నారు.

సమ్మెకు సన్నద్ధమౌతున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎపి జెఎసి కార్యాచరణలో భాగంగా మంగళవారం జెఎసి నాయకులు, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలిసి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక రిటైర్డ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన కార్యాచరణను అందించారు. ఈ సందర్భంగా వారు ఈనెల 9 నుంచి అమలు చేయనున్న ఉద్యమ కార్యాచరణకు, తమ న్యాయమైన కోర్కెలు, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం, జాయింట్ కలెక్టర్ ఆనంద్, ఆర్‌డిఒను కలిసి కార్యాచరణ అందజేశారు. అనంతరం జిల్లాలోని అన్ని కార్యాలయాలకు వెళ్లి కరపత్రాలు అందజేసి జిల్లా అధికారులను, ఉద్యోగులను ఉద్యమంలో పాల్గొనవల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి నాయకులు జిశ్రీరామమూర్తి, మరిపి శ్రీనివాసరావు, చంద్రమౌళి తదితరులున్నారు.

సచివాలయ సందర్శన

పాలకొండ : మండలంలోని పనుకువలస సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం పరిశీలించారు. పిఎంజెఎవై సర్వే రికార్డులతో పాటు సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

ఘనంగా చిన్నమ్మతల్లి పండగ

సీతానగరం : మండలంలోని బళ్లకృష్ణాపురం, దయానిధి పురం గ్రామాల్లో పైడితల్లమ్మ, చిన్నమ్మ తల్లి పండగలు ఘనంగా నిర్వహించారు. సిరిమానును పూజారి అలంకరించి గ్రామమంతా భక్తి శ్రద్ధలతో కొలిచారు. కార్యక్రమంలో చంబింగి వెంకట చిన్నప్పలనాయుడు, చైర్‌పర్సన్ సాయితో పాటు, మండల నాయకులు, ఆ గ్రామ సర్పంచులు ఎన్.రామకృష్ణ, టి.రామారావు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

భామిని : స్థానిక పిహెచ్‌సిలో తిరుపతి నవజీన్ సంస్థ, డాక్టర్ శ్రీధర్ ఆచార్య సహకారంతో హోలీ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 120 మందికి కంటి చూపును పరిశీలించి, దృష్టి లోపం కలిగిన 42 మందికి కంటి ఆపరేషన్ కోసం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి పంపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, హోలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్, నవజీన్ సంస్థ చీఫ్ మేనేజర్ ఎస్‌వి రమణ, స్థానిక వైద్యులు డాక్టర్ పనికుమార్, సోయల్, సిహెచ్‌ఒ భాస్కరరావు, ఆప్తాలమిక్ ఇప్పిలి జానకి రామయ్య వున్నారు.

మల్లి క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ కొత్తూరు

సీతంపేట : మండలంలోని మల్లి గ్రామంలో మల్లిమ్మతల్లి జాతర సందర్భంగా నిర్వహించిన 10 × 10 క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్‌గా కొత్తూరుకు చెందిన కొత్తూరు తరుణ్ జట్టు నిలిచింది. ఈ పోటీల్లో చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండలాల నుంచి సుమారు 80 జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా నిలిచిన కొత్తూరు తరుణ్‌జట్టుకు రూ.15వేలు నగదు బహుమతిని స్థానిక ఎస్ఐ నీలకంఠరావు అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన మల్లీ లైన్‌మెన్ జట్టుకు రూ.7,500 ఆలయ అధ్యక్షులు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గణేష్, సింహాచలం, ఆనందరావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం : గరుగుబిల్లి మండలం తోటపల్లిలో నివర్తి ప్రసాద్, ధనుంజయ రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ అదనపు ప్రబంధకులు ధనుంజయరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నుంచి 25 రకాల విత్తనాల మిశ్రమాన్ని విత్తన బంతులుగా చేసి పొలంలో వేసుకోవడం ద్వారా రైతులు ఆదాయం పొందడం, మొక్కల్లో జీవవైవిధ్యం సాధించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామైక్య సంఘాల ద్వారా నవధాన్యాల సాగుకు ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జట్టు సంస్థ కో డైరెక్టర్ ఎం.నూకం నాయుడు, సబ్ డివిజన్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ ఉన్నారు.

ఏనుగులను తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలి

కొమరాడ ఏనుగులను జూకు లేదా అడవికి తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు ఏనుగులు వచ్చి ఆరేళ్లయ్యాయని, వీటి దాడి వల్ల 10మంది మరణించగా, సుమారు రూ.10కోట్లు వరకు ఆస్తినష్టం జరిగిందన్నారు. ఇంత జరుగుతుంటే జిల్లా స్థాయి అధికారులు, పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఏనుగుల సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకున్న పెదమేరంగి వాసులు

కొమరాడ : మండలంలోని అంటివలసలో ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు పెద మేరంగికి చెందిన అజ్జాడ రామకృష్ణ బృందం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బోటు రామకృష్ణ ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. మంగళవారం బాధిత కుటుంబాలకు రూ.23వేలు బట్టలు, నిత్యవసర వస్తువులు ఇచ్చి ఆదుకున్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ డిస్టిక్ కోఆర్డినేటర్ యమ్మల జనార్దనరావు, కొమరాడ మండల నివాసి బత్తుల శ్రీను, గంగరాజు, ప్రసాదు, రామస్వామి, రామారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కురుపాం : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల సమైక్య కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎపిఎం ఇవి కిషోర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేసి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెంది పారిశ్రామిక వేత్తలుగా తయారవ్వాలని అలాంటప్పుడే సమాజం బాగుంటుందని అన్నారు. అనంతరం మహిళలు, మండల సమాఖ్య సిబ్బంది సన్మానించగా, పిడి, సిబ్బంది, ఒబి సభ్యులకు, మహిళా విఒఎలను సన్మానించారు. కార్యక్రమంలో సిసిలు పి.నాగేశ్వరరావు, దాశరథి, గోపాల్, జి.ఉదయ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లివిరిలో డోలా యాత్ర

భామిని : మండలంలోని లివిరిలో రాధా గోపీనాథ స్వామి డోల యాత్ర మహోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 15 వరకు 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం రాధా గోపినాధస్వామి విగ్రహాలు ఊరేగింపు, హోలీ సంబరాలు, నదీ స్నానాలతో ప్రారంభమవుతాయన్నారు. తొమ్మిది రోజు పాటు నిర్వహించే ఈ డోల యాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సోమరాజు గోపాలరావు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, సర్పంచ్ ప్రతినిధి బౌరి త్రినాథ్, ఎంపిటిసి పొట్నూరు ఉష, గౌడు కైలాష్, ఆలయ కమిటీ సభ్యులు వున్నారు.

రూ.1.52 లక్షలకు 16 వాహనాల వేలం

పార్వతీపురం టౌన్ : నాటు సారా కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలకు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.లక్షా 52,152 ఆదాయం వచ్చిందని సిఐ కృష్ణారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి సుభాష్ ఆధ్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించినట్టు తెలిపారు.



వాహనాల వేలం పాటలో పాల్గొన్న సిఐ కృష్ణారావు

విద్యార్థులే తల్లిదండ్రుల ఆశాజ్యోతులు

ప్రజాశక్తి - బలిజిపేట

తల్లిదండ్రుల ఆశాజ్యోతి విద్యార్థులేనని జిల్లా విద్యాశాఖ అధికారి డివిఎస్ రమణ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి తరానికి తల్లిదండ్రులకు ఆశాజ్యోతులుగా విద్యార్థులే ఉంటారని, విద్యార్థి దశ చాలా ప్రాముఖ్యమైనదని, విద్య వినియోగించుకోవడంలో విద్యార్థులు ప్రధమ పాత్ర పోషిస్తూ, విద్యా విలువలను, మెలుకువలను ఉపాధ్యాయుల నుంచి నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థి దశ చాలా కీలకమైందని, పదో తరగతి విద్యార్థులకు జీవితంలో మొదటి మెట్టుగా టెన్త్ ఉంటుందని, ఉత్తీర్ణత సాధించడంలో విద్యార్థులు ప్రతిక్షణం ముందుండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రాజేశ్వర, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి బృందం సింహాద్రి, శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : విద్యార్థులు సక్రమంగా చదువుకొని శతశాతం ఉత్తీర్ణత సాధిస్తేనే పాఠశాలకు పునాది అవుతుందని ఐటిడిఎ ఎఎంఒ పి.చినమోహన్‌రాయుడు అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.రామగోవిందం ఆధ్వర్యంలో జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రతి విద్యార్థి సక్రమంగా చదివి పదికి పది పాయింట్లు సాధించి శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురికి ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వసతి గృహ సంరక్షణ అధికారి కె.సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిఇఒ రమణ

వీరఘట్టం : అందరూ బాగా చదివి టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు వి.భాస్కరరావు విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు సభలో పాల్గొని మాట్లాడారు. అందరూ కష్టపడి చదవాలన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నడిమింటి గంగాభవాని, మోహన్‌రావు దంపతులు విద్యార్థులకు అట్టలు, పెన్సిల్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సినీ గేయాలకు నృత్య ప్రదర్శన చేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం, 5వతరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో జిల్లాలో నాలుగో తరగతి రెగ్యులర్‌గా చదివిన వారు ఐదోతరగతి ప్రవేశానికి అర్హులని చెప్పారు. ఐదో తరగతిలో 80 సీట్లు మాత్రమే భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి గ్రూపులో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఒక్కొక్క గ్రూపులో 40సీట్లు ఉంటాయని చెప్పారు. జోగింపేట గురుకులంలో కేవలం బాలురు అడ్మిషన్లు మాత్రమే జరుగుతాయని చెప్పారు. మార్చి24లోగా ఆన్లైన్ ద్వారా లేదా నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని, అర్హత పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల, జిల్లాకో-ఆర్డినేటర్‌ను సంప్రదించాలని కోరారు.

మహిళా పక్షపాతిని

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్ జయమణి



ప్రజాశక్తి- సీతానగరం

మహిళా ప్రజాప్రతినిధిగా వాకి పక్షపాతిగా ఉండడం చాలా గర్వపడుతున్నానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ సవరపు జయమణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

1991లో ఆదర్శ మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గుర్తింపు పొందేలా పనిచేయడం ప్రజల మన్ననలు పొందగలిగాను. అప్పటి నుండే తొలిత రాజకీయ రంగ ప్రవేశం 1995 ఎంపిపిగా ప్రజా సేవకు ఒక మహిళా ప్రజా ప్రతినిధిగా తొలి అడుగు వేశాను. ఇక్కడ నుంచి జిల్లా ప్రాదేశిక సభ్యురాలిగా, పార్వతీపురం ఎమ్మెల్యే స్థాయికి ఎదిగాను. పురుషులతో మహిళా సమానత్వం సాధించాలంటే స్త్రీ సామాజిక, రాజకీయ, ఆర్థికంగా ఎదగాలి. అందుకు ప్రజా ప్రతినిధిగా మహిళలకు ఉపాధి కల్పనలో కుట్టుమిషన్లు ట్రైనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్స్, విస్తరాకుల పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశాల న్నింటిని మహిళలకు కల్పించడం జరిగింది. మహిళా ప్రజా ప్రతినిధుల స్థానాలను పురుషుల ఆధిపత్యం లేకుండా మహిళలకే ప్రాధాన్యతిచ్చేలా రాజకీయ ప్రస్థానంలో గట్టి కృషి చేశానన్న సంతప్తినిచ్చింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను గుర్తించి రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించడం ఆయనకు కృతజ్ఞతలు. నేడు మహిళలు గృహహింసలు, వరకట్న వేధింపులు, అత్యాచారాలు ఎదుర్కొంటున్నారు. వీటి నివారణకు చట్టాలు కఠినంగా అమలు చేయాలి. ఒక మహిళా కమిషన్ సభ్యురాలిగా భార్యాభర్తల సమస్యలు ఎన్నో తన దృష్టికి వస్తున్నాయి. ఇందులో మహిళలకు ఎలాంటి నష్టం జరగకుండా పరిష్కారం చేస్తుండడంతో ప్రజల అభిమానాలు పొందగలుగుతున్నాను.

మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి

ప్రజాశక్తి - సాలూరు



మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి చెప్పారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లో...

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపిణీ లో మహిళల కు 50శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నది వైసిపి ప్రభుత్వం మాత్రమే. సంక్షేమ పథకాల అమలులోనూ మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే సాధికారత సాధ్యమవుతుంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే నామినేటెడ్ పదవుల పంపిణీలో 50శాతం కేటాయింపు ముఖ్యమంత్రి చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక వంటి పథకాలు మహిళా విద్యకు ప్రోత్సాహకంగా ఉన్నాయి.



పట్టణంలోప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేసేందుకు ఈ నెల 13న జరుగు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. పట్టణంలోని 25వ వార్డు మద్దాలవారివీధిలో (బొగ్గులవీధి) నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు దావాల రమణారావు, ఎస్.మహేష్, డి.దుర్గారావు, కె.రాము తదితరులు మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజాసంఘాల తరుపున పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల చిత్రాలను గీసి చూపించారు. విద్యార్థులకు పలు రకాలైన ఆటలు పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. కళాశాలలో పనిచేస్తున్న మహిళ అధ్యాపకులను సన్మానించారు. అనంతరం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించడం అభినందనీయమన్నారు. బాగా చదువుకొని, రాణించి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు పెద్ద రామకృష్ణ, త్రినాధరావు, సిబ్బంది ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో డిఐఒ పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గిరిజన మహిళలకు ఆరోగ్య సలహాలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

మండలంలో దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న మారుమూల గిరిజన గ్రామాలు కుస, దేరువాడ, కొత్తవలస, లోవలక్ష్మీపురం, గొరడ, రేగిడి, దుడ్డుఖల్లు గ్రామాలను మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, హై రిస్క్ గర్భిణులు, బాలింతలు, శిశువుల గృహ సందర్శనలు చేసి అందుతున్న వైద్య సేవలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులను నమోదు వివరాలను పరిశీలించి గర్భిణుల, శిశువుల ఆరోగ్య పర్యవేక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేసి అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. చిన్నారుల బరువులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం దుడ్డుఖల్లులో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను, రేగిడిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రక్తహీనత, సీజనల్ వ్యాధులు, ఇమ్యూనిటీ, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.స్వాతి, ఎం.శంకర్, హాస్టల్ ప్రిన్సిపాళ్లు సుగుణ, సుబ్బారావు, సూపర్ వైజర్లు రమణ, రాజేశ్వరి, శ్రీను, నిర్మల, జయ గౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌తో ఎపి సత్తాచాటిన సిఎం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విశాఖలో ఈనెల 3, 4 వ తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక రంగం కోసం సిద్ధంగా ఉన్న వనరులు, అవకాశాలను సిఎం వైఎస్ జగన్ సారథ్యంలో ప్రపంచానికి చూపారని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక వనరులున్న నగరంగా విశాఖ నిలుస్తుందన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తెస్తామన్నారు. ఈ సమ్మిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులను గ్రౌండ్ చేయడం కోసం సిఎం ప్రత్యేకంగా సిఎస్ హోదా గల ఐఎఎస్ అధికారులతో కూడిన స్పెషల్ కమిటీని నియమించారని, ఈ కమిటీ పారిశ్రామిక వేత్తలకు పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం నుంచి అందించే సహకారం, నైపుణ్యవంతమైన యువత అందుబాటుకు పారిశ్రామిక దిగ్గజాలకు గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా భవిష్యత్తులో 6 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పారిశ్రామిక కేంద్రాలుగా నిలిచే దేశంలోని మూడు కీలక కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం ప్రస్తుత పెట్టుబడులకు శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, స్టేట్ డైరెక్టర్లు, జెసిఎస్ కన్వీనర్లు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపఎన్నికకు సహకరించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సాలూరురూరల్

జెడ్‌పిటిసి సభ్యులు అంబటి అనిల్‌కుమార్ మృతితో ఖాళీ అయిన జిల్లా ప్రాదేశిక కేంద్రానికి జరగనున్న ఉప ఎన్నికకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపిడిఒ జి.పార్వతి కోరారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ ఎన్నిక నిమిత్తం పోలింగ్ కేంద్రాల పరిశీలన కోసం అవగాహన, దీని కోసం అన్ని పార్టీలు వారు మీ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న టిడిపి నేతలు వినతి పత్రం రూపంలో ఈ ఎన్నికను వివాదాస్పద ఆంధ్రా- ఒడిశా కొటియ గ్రూప్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేస్తారని, ఏర్పాటు చేసిన దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. గతంలో కొన్ని ఎన్నికలు నేరెళ్లవలసలో పోలింగ్ స్టేషను నిర్వహించేవారని, ఇక్కడికి హిల్‌టాప్ ఓటర్లు ఎలా వస్తారని, దారిలో ఒడిశా అధికారులు అడ్డగిస్తున్నారని, గత సాధారణ ఎన్నికల్లో ఇదే జరిగిందని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని వారు ఆమెను ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.తిరుపతి రావు, శ్రీను, మర్రి శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు

పార్వతీపురం ఎరూరల్ : మండలంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ కోరారు. మంగళవారం తన చాంబర్‌లో మండల ప్రధాన రాజకీయ పార్టీలు, జడ్‌పిటిసి, ఎంపిటిసిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన ఎంపిటిసి, వార్డు సభ్యుల స్థానాల్లో త్వరలో ఉపఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సన్నాహకాలు ప్రారంభించిందన్నారు. ఇప్పటికే సదరు స్థానాల్లో ఓటర్ల జాబితాలు సిద్ధం చేశామని, అయితే ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటిఐలో శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

ఎపి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో స్కిల్ హబ్ నందు ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి యు.సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ప్లంబర్ అసిస్టెన్స్ ఎలక్ట్రీషన్ ఫోర్ వీలర్ సర్వీస్ ,టెక్నీషియన్ స్ప్రింయిగ్స్ మిషన్ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 7, 8, 9 తరగతిలో చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఈ కోర్సులో శిక్షణ పొందిన వారికి ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగం కల్పించబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 70 32 0 60 77 3 8ను సంప్రదించాలన్నారు.

విత్తనగుళికల ద్వారా అపరాల సాగు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వర్షాభావ పరిస్థితుల్లో, నీటిఎద్దడి ప్రాంతాల్లో విత్తనాలు గుళికల ద్వారా అపరాల సాగు అనుకూలంగా ఉంటుందని డిపిఎం షణ్ముఖరాజు అన్నారు. మంగళవారం పార్వతీపురం మండలం పెదబొండపల్లి యూనిట్‌లో రైతులకు విత్తన గుళికల ద్వారా అపరాల సాగు గురించి అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా ఆయన తక్కువ వర్షపాతంతో మొలకెత్తే విత్తనాలను విత్తన గుళికలుగా తయారుచేసి రైతులు నీటి వసతి లేని పొలంలో ఇవి వేయడం వల్ల ఎప్పుడు వర్షం పడుతుందో ఈ విత్తన గుళికలుగా చేసిన విత్తనాలు మొలకెత్తుతాయని తెలిపారు. ఇలా వేయడం వల్ల రైతుకు కొంత ఆదాయం వస్తుందన్నారు. ఇలానువ్వులు, అసలు, మినుములు, అలసందలు, జొన్నలు, ఆముదం, గోంగూర, బెండ, బీర విత్తనాలను విత్తన గుళికలుగా తయారు పద్ధతిపై అవగాహ కలిగి ఉండాలని అన్నారు. అనంతరం గుళికల తయారీ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో రీసోర్‌పర్సన్ శ్రీరాములు నాయుడు తదితరులు న్నారు.

చిరుధాన్యాలు గిరిజనుల సంప్రదాయ పంటలు

పాచిపెంట : చిరుధాన్యాలు సాగు, వినియోగం గిరిజనుల సాంప్రదాయమని, ఈ సాంప్రదాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదని, గిరిజనుల జీవనశైలికి ఆరోగ్యానికి ఈ చిరుధాన్యాలకు ఎంతో సంబంధం ఉందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని శీల గ్రామంలో గిరిజన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల ఆవశ్యకత వినియోగం ప్రజల్లో పెరగాలన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీపై విత్తనాలను సరఫరా చేస్తుందని, కావున రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందర్భంగా చిరుధాన్యాల ఆవశ్యకతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ దినేష్, సిఆర్‌సి బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండకూడదు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఇ ఎ.రాజారావు మున్సిపల్ ఇంచార్జ్ డిఇ నరసింగరావుకు, ఎఇ ఆనంద్‌కు సూచించారు. మంగళవారం ఆయన పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తితో కలిసి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే తోటపల్లి వద్ద ఉన్న నాగావళి రిజర్వాయర్‌ను, ఇన్ ఫిల్టరేషన్ బావులను, పంప్ హౌస్‌లో ఉన్న మోటార్ల పనితీరును పరిశీలించారు. తాగునీటి సరఫరా జరిగే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. మోటార్లు మరమతులకు గురైన సందర్భంలో అదనపు మోటార్లను ఉంచుకోవాలని సూచించారు.

కుళాయి లీక్‌లతో ఇబ్బందులు

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని గంగాడ గ్రామంలో మంచినీరు పైపులకు లీకులు ఉండటం వల్ల గ్రామంలో సక్రమంగా నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దళిత వీధులకు నీరు అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం పేరుకుపోవడంతో గ్రామంలో ప్రజలు అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల, ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ లోపం అని ప్రజల ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రజలందరికీ మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని లీకులు ఉండే పైపులను మార్చాలని పారిశుధ్య పనులు చేపించాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి మహిళ మృతి

బొబ్బిలి: మండలంలోని గొర్లె సీతారాంపురం సమీపంలో అప్పయ్య చెరువులో పడి బాడంగి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన రేగుల వలస సుబ్బలక్ష్మి మరణించింది. చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలుకు 50ఏళ్ల వయస్సు ఉండవచ్చునని పోలీసులు అంచనా వేశారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించి వుండవచ్చునని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలిస్తే పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సిఐ నాగేశ్వరరావు కోరారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంరూరల్ : సీతానగరం మండలం చినభోగిలికి చెందిన కోరాడ మణి బతుకు తెరువు నిమిత్తం తల్లిదండ్రులతో కలిసి విజయవాడలో నివాసముంటున్నాడు. చినభోగిలిలో జరుగుతున్న గంగమ్మ పండగ నిమిత్తం కొద్దిరోజుల కితం అతని చిన్నాన్న ఇంటికి వచ్చి, తిరిగి విజయవాడ వెళ్లేందుకు ఇష్టపడలేదు. దీంతో విజయవాడలో ఉన్న తల్లిదండ్రులు ఫోన్‌లో మందలించడంతో మనస్థాపం చెంది, ఇంట్లో ఉన్న మాత్రలను అధికసంఖ్యలో మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు పార్వతీపురం జిల్లా అసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టుపోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.